నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల, మంగళవారం 19 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఎన్‌హెచ్-63కి భూములివ్వం

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎన్‌హెచ్-63 బాధితులు

మంచిర్యాల అర్బన్, మార్చి 18 : ఎన్‌హెచ్-63కి భూములిచ్చేది లేదని, 2018 నాటి రూట్ మ్యాప్ ఆధారంగా జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి సారవంతమైన పంట భూములిచ్చామని, ఉన్న కొద్దిపాటి భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నామని, వాటిని సైతం లాక్కోవాలని చూడడం అన్యాయమన్నారు. తమ బతుకులను రోడ్డు పాలు చేయడం దారుణమని వాపోయారు. పాత ప్లాన్ ప్రకారమే హైవే నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రేహౌండ్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్

మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్, శిక్షణకు హాజరైన పోలీసు సిబ్బంది

ఆసిఫాబాద్, మార్చి18 : పోలీసు సిబ్బంది గ్రేహౌండ్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వారం పాటు గ్రేహౌండ్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనుండగా, ఆయన సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు గ్రేహౌండ్స్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సీఐ రాణాప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆసిఫాబాద్ సీఐ సతీశ్, ఆర్ ఎస్సైలు పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్ : పరీక్ష కేంద్రం వద్ద క్యూ కట్టిన విద్యార్థులు, పరీక్ష రాస్తున్న విద్యార్థులు

'పది' పరీక్షలు ప్రారంభం

కెరమెరి : మోడీ పరీక్ష కేంద్రానికి వస్తున్న పదోతరగతి విద్యార్థినులు

- కేంద్రాలను సందర్శించిన ఉన్నతాధికారులు
- కెరమెరిలో ఇద్దరు విద్యార్థుల డీబార్

మంచిర్యాల అర్బన్, మార్చి 18 : జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. 52 కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు/ఉర్దూ/హిందీ) పరీక్ష రాశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య జిల్లా కేంద్రంలోని చెన్నూర్ రోడ్ పాఠశాల, ఆర్‌బీహెచ్‌వీ, జడ్పీ బాలుర పాఠశాల, కృష్ణవేణి పాఠశాలలతో పాటు మంద మర్రిలోని సింగరేణి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏసీజీఈ దామోదర్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

99.70 శాతం హాజరు...

మొదటి రోజు 99.70 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలో రెగ్యులర్, సప్లిమెంటరీ విద్యార్థులు మొత్తం 9,306 మంది విద్యార్థులకుగాను, 9,278 మంది హాజరయ్యారు.

నెన్నెలలో అదనపు కలెక్టర్

నెన్నెల,మార్చి18 : మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలోని కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో దేవెందర్‌రెడ్డి ఉన్నారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

ఆసిఫాబాద్,మార్చి18 : జిల్లా వ్యాప్తంగా 37 కేంద్రాలు ఏర్పాటు చేయగా 6,457 మంది విద్యార్థులకుగాను, 6,408 మంది హాజరయ్యారు. పలుచోట్ల కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్ సందర్శించారు. విద్యార్థులకు ఇబ్బందులేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. వారివెంట ఎస్బీ సీఐ రాణాప్రతాప్, ఆసిఫాబాద్ సీఐ సతీష్ ఉన్నారు.

ఇద్దరు డీబార్

కెరమెరి, మార్చి 18: కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడీలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయిన్నట్లు సీఎస్ స్వర్ణలత తెలిపారు.

సరిహద్దుల్లో నిఘా

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు

సిర్పూర్(టీ) వద్ద నగదును స్వాధీనం చేస్తున్న పోలీసులు

- తెలంగాణ- మహారాష్ట్ర బార్డర్‌లో చెక్‌పోస్టులు
- నగదు, మద్యం రవాణాకు అడ్డుకట్ట
- ఇప్పటికే రూ. లక్షల్లో పట్టివేత
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. ప్రస్తుతం కోడ్ అమల్లోకి రాగా జిల్లా పోలీసు శాఖ భారీబందోబస్తు ఏర్పాటు చేసింది. ప్రధానంగా తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లోని రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టింది. అక్రమంగా నగదు, మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. కోడ్ అమల్లోకి వచ్చిన మొదటి రోజే (ఆదివారం) రూ. 10 లక్షల దాకా పట్టుకొని సీజ్ చేసింది.

చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు..

జిల్లా సరిహద్దులను ఆనుకొని ఉన్న మహారాష్ట్ర నుంచి ఎలాంటి అక్రమ రవాణా జరుగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల పోలీసులు, అధికారులతో పాటు మహారాష్ట్ర పోలీసులతో ఇటీవల నాగ్‌పూర్ ఐజీ చెర్రింగ్ డోర్జే ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ మేరకు శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా శాంతి యుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు. నగదు, మద్యం అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా అన్ని మార్గాల్లో నిఘా పెంచారు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద, చింతలమానెపల్లి మండలం గూడెం, బెజ్జూర్ మండలం సోమిని, సిర్పూర్(టీ) మండలంలోని వెంకట్రావుపేట, కాగజ్‌నగర్ మండలం నందిగూడ, వాంకిడి సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి ఈ మార్గాలగుండా రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

మొదటి రోజు రూ. 10 లక్షలకు పైగా..

సిర్పూర్(టీ) మండలం వెంకట్రావుపేట అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద కోడ్ అమల్లోకి వచ్చిన మొదటి రోజైన ఆదివారం రూ.5.26 లక్షలు పట్టుబడగా, కాగజ్‌నగర్ మండలం నందిగూడ చెక్ పోస్టు వద్ద రూ.4.87 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ. 50 వేలకు మించి తరలించే సమయంలో ఆ నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా తమవెంట ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మద్యం, ఇతర విలువైన వస్తువులేవైనా రవాణా చేస్తున్న సమయంలో వాటిని ఎక్కడి నుంచి ఎక్కడి తరలిస్తున్నారు అనే ఆధారాలను తప్పక సూచించాల్సి ఉంటుందని, లేదంటే సీజ్ చేస్తామని చెబుతున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంపై నిఘా ఏర్పాటు చేశారు. గత ఎన్నికల్లో అల్లర్లు, సమస్యలను సృష్టించిన వారిపై నిఘా పెట్టనున్నారు. బైండోవర్ కేసులు నమోదు చేయనున్నారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో పోలీసులు నిరంతరం పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు.. ఇక ఎన్నికలను పాదర్శకంగా నిర్వహించటంలో భాగంగా ఫ్లయింగ్, స్టాటిక్, వీడియో సర్వేయలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించిన సీ విలేజ్ యాప్ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకోనున్నారు. ఓటర్లను మభ్య పెట్టేందుకు అక్రమంగా నగదు, మద్యం రవాణా కాకుండా చూడడంతోపాటు రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచారాలపై కూడా దృష్టిసారించనున్నారు.

సాయి కుటుంబానికి న్యాయం చేయాలి

- డీఎస్పీ కార్యాలయం ఎదుట బంధువులు, కుటుంబ సభ్యుల ధర్నా
- పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పిన సీఐ

కాగజ్‌నగర్ డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నామనగర్ బాధిత కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్, మార్చి 18 : ఇటీవల మృతి చెందిన సాయికుమార్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ సోమవారం కాగజ్‌నగర్ డీఎస్పీ కార్యాలయం ఎదుట అతడి బంధువులు, కుటుంబ సభ్యులు ధర్నా చేశారు. కాగజ్‌నగర్ మండలం నామనగర్‌కు చెందిన సాయి, ఓ యువతి కొంతకాలంగా ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. సదరు యువతికి వివాహ వయస్సు లేనందున పెండ్లి వాయిదా పడింది. ఈ క్రమంలో సాయికుమార్ తన ప్రేయసి ఇంట్లోనే ఈ నెల 11న అనుమానాస్పదంగా మృతి చెందాడు. మెడపై గాట్లు ఉండడంతో సాయిని యువతి కుటుంబ సభ్యులే హత్య చేశారని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను నామమాత్రంగా అదుపులోకి తీసుకొని వదిలేశారని, వారం గడస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని కాగజ్‌నగర్ డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో పట్టణ సీఐ శంకర్ జోక్యం చేసుకొని పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

హుడ్కులీ చెక్‌పోస్టు వద్ద రూ. 5 లక్షలు పట్టివేత

సిర్పూర్(టీ), మార్చి 18 : మండలంలోని హుడ్కులీ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద సిర్పూర్(టీ) ఎస్ఐ దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. సోమవారం చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన కుమ్రం నరేశ్ మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు రూ. 5 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నారు. అలాగే ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఎండీ ఆరీఫ్ బల్హార్షా నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి వాహనంలో తీసుకెళ్తున్న 17 మిక్చర్ గ్రైండర్లను పట్టుకున్నారు. చెక్‌పోస్ట్ సిబ్బంది షోయబ్, ఎస్ఎస్‌టీ టీమ్ అధికారి వీణా, సిబ్బంది ఉన్నారు.

ఇందన్‌పెల్లి చెక్ పోస్టువద్ద..

జన్నారం, మార్చి 18 : మండలంలోని ఇందన్‌పెల్లిలోని అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద సోమవారం రూ. లక్షా ఐదు వేలను పట్టుకున్నట్లు సీఐ అల్ల నరేందర్ లెలిపారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న డబ్బులను సీజ్ చేసి ఎన్నికల స్క్వాడ్‌కు అప్పగించినట్లు తెలిపారు.

సరైన పత్రాలు లేని రూ.5 లక్షలను పట్టుకున్న ఎస్ఐ రమేశ్, సిబ్బంది

లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే
- కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమీక్ష

ఆసిఫాబాద్,మార్చి 18 : లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎఫ్‌వో నీరజ్ టెబ్రివాల్‌తో కలిసి నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో 001-సిర్పూర్‌లో 320 పోలింగ్ కేంద్రాలు, 005-ఆసిఫాబాద్‌లో 356 పోలింగ్ కేంద్రాలు, అలాగే సహాయక పోలింగ్ కేంద్రాలు మొత్తంగా 676 ఏర్పాటు చేశామని, బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లను నియమించామని తెలిపారు. జిల్లాలో 2 లక్షల 26 వేల 994 మంది పురుషులు, 2 లక్షల 28 వేల 415 మంది మహిళలు, 28 మంది ట్రాన్స్ జెండర్లు, 404 సర్వీస్ ఓటర్లు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులు 5 వేల 556 మంది, 6 వేల 931 మంది దివ్యాంగులు ఉన్నారని చెప్పుకొచ్చారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో 9 స్టాటిక్ సర్వైలైన్స్ టీంలు, 8 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 9 వీడియో సర్వైలైన్స్ టీంలు, 2 వీడియో పరిశీలన బృందాలు, 8 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, 2 అకౌంటింగ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్, జిల్లా గ్రీవెన్స్ కమిటీ, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనల మేరకు వివిధ రాజకీయ పార్టీలు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, ఫొటోలు, వాల్ రైటింగ్స్...ఇతరత్రా తొలగించడం జరుగుతుందని తెలిపారు. శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి నివేదికలను ప్రతి రోజూ సమర్పించే విధంగా జిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై స్పందించాలని, మద్యం, నగదు, కానుకల పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టాలని, రాజకీయ పార్టీలకు సంబంధించిన ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కలెక్టరేట్‌లో 1950 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, మార్చి 18(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. సోమవారం పెద్దపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌లతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటీని, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహిస్తారని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 1850 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం 15 లక్షల 92 వేల 996 మంది ఓటర్లు, 1395 మంది సర్వీస్ ఓటర్లు, 102 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారన్నారు.

మంచిర్యాల జిల్లా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జండర్	మొత్తం ఓటర్లు	ఎన్ఆర్ఐ	సర్వీస్ఓటర్లు
చెన్నూరు(ఎస్‌సీ)	227	95,974	97,264	7	1,93,245	8	134
బెల్లంపల్లి(ఎస్‌సీ)	227	86,802	88,530	13	1,75,345	2	162
మంచిర్యాల	287	1,38,472	1,40,559	25	2,79,056	27	335
మొత్తం	741	3,21,248	3,26,353	45	6,47,646	37	631

ఎన్నికల నియమావళిని
కచ్చితంగా అమలు చేయాలి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మార్చి 18 : పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, మోతీలాల్, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి ఆబ్కారీ, బ్యాంకు, ఆదాయపన్ను, రవాణా, జీఎస్‌టీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను ప్రలోభ పెట్టే అంశాలైన నగదు, మద్యం, కానుకల రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. రూ. 50 వేల కంటే ఎక్కువగా తరలించినట్లయితే సీజ్ చేయడం తప్పదని సూచించారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు అందించిన 100 నిమిషాల్లో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని మద్యం దుకాణాల్లో నిల్వలను తనిఖీ చేయాలని, బెల్టుషాపులను నియంత్రించాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన నగదు లావాదేవీల విషయంలో ఏమైనా అనుమానాలుంటే సంబంధిత బ్యాంకర్ల సాయంతో భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఆబ్కారీ, మద్యనిషేధ శాఖ అధికారి నంద గోపాల్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా రవాణాశాఖ అధికారి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ నెట్‌వర్క్ ప్రచార వివరాలివ్వాలి

లోక్ సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా పరిధిలోని వివిధ రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన మొబైల్ బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ కాల్స్, మెసేజ్‌ల వివరాలను అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి వివిధ మొబైల్ నెట్‌వర్క్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కార్యాలయంలో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, నెట్‌వర్క్ పరిధిలో జరిగే ప్రచారం సంబంధిత పూర్తి వివరాలతో ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, మొబైల్ నెట్‌వర్క్‌ల ప్రతినిధులు, ఎన్నికల పాల్గొన్నారు.

అనుమానిత లావాదేవీలపై దృష్టి పెట్టాలి

నస్పూర్, మార్చి 18 : ఎన్నికల నేపథ్యంలో బ్యాంకుల పరిధిలో జరిగే అనుమానిత నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు పరిధిలో రూ. లక్ష కంటే ఎక్కువగా నగదు జమ అయినా, తీసుకున్నా.. వివరాలను ఎన్నికల ఖర్చుల పరిశీలకులకు అందించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు

భీమారం, మార్చి 18 : భీమారం కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. సోమవారం స్థానిక లక్ష్మీ అమ్మవారి ఆలయానికి వస్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను ఆవుడం క్రాస్ రోడ్డు వద్ద ఇప్పల బోగుడ కాలనీ వాసులు ఆపారు. యువ కాంగ్రెస్ నాయకుడు నరేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకోసం తాము ఎంతో శ్రమించామని, తమ కాలనీలో బోరు వేయకుండా మరో కాలనీకి తరలించారని ఆయన వివేక్ దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డిపై, పలువురు నాయకులపై ఫిర్యాదు చేశారు. దీంతో వివేక్ కలగజేసుకొని బోర్ కావాలంటే పంపించానని, చిన్న చిన్న విషయాలు తన వద్దకు తీసుకురావద్దని అక్కడ నుంచి వెళ్లిపోయారు.